క్లుప్తంగా

షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



డోన్: పట్టణ శివారులో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి 41 రోజులు కావడంతో కమిటీ నిర్వాహకులు విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు.

ధ్వజస్తంభ పూజలు



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని పలక చింతమాను ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ట జరిగి 41 రోజులు పూర్తికావడంతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక



నియామక పత్రం అందుకుంటున్న మహేష్

కోవెలకుంట్ల: భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యదర్శిగా కోవెలకుంట్లకు చెందిన బొంత మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంటూరులో ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శివ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో మహేష్‌కు స్థానం దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

26న ముస్లింలకు మంత్రి ఇఫ్తార్ విందు



ముస్లింలను ఆహ్వానిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె రూరల్: రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఈ నెల 26వ తేదీ రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తన సొంత నిధులతో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని అన్ని మసీదులకు వెళ్లి ముస్లిం మతపెద్దలకు దుస్తులు అందజేసి ఇఫ్తార్ విందుకు ఆహ్వానించారు. కాగ తన క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద 36 మంది లబ్ధిదారులకు రూ.34 లక్షల విలువైన చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.

బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్‌కు సన్మానం




కానిస్టేబుల్ శేఖర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ప్యాపిలి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శేఖర్ నంద్యాల స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఎస్‌ఐ మధుసూదన్ ఆధ్వర్యంలో శేఖర్‌ను స్థానిక సిబ్బంది ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన చోట కూడా అధికారులతో పాటు సిబ్బంది మన్ననలు పొందాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని మార్కెట్ యార్డు వెనుక ఉన్న అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఆదివారం రాత్రి సిబ్బందితో దాడి చేశారు. పట్టణానికి చెందిన శివశంకర్‌గౌడ్, ఆలా సురేంద్ర, మద్దిలేటి నాయుడు, భాస్కర్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నాగాచారి, మనోహర్, లోకేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,02,390 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

చలువ పందిళ్లు ఏర్పాటు



బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఆలయ ఆవరణలో వేచి ఉండేందుకు సౌకర్యవంతంగా చలువ పందిళ్లను ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉపకమిషనర్, ఈఓ రామాంజనేయులు తెలిపారు. స్వామి, అమ్మవార్లను ఊరేగింపు నిర్వహించే మాడ వీధుల్లో భక్తులు పాద రక్షలతో తిరగవద్దని సూచించారు.

వేసవికాలం..

పశువులు భద్రం

- పశువులకు వడదెబ్బ ముప్పు
- లక్షణాలు గుర్తించడం ముఖ్యం
- ముందస్తు జాగ్రత్తలు అవసరం

కోవెలకుంట్ల: వేసవిలో పశువులను నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. దీనికారణంగా పాల దిగుబడి తగ్గుముఖం పడుతుంది. మరికొన్ని మృత్యువాత పడుతాయి. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే పాడిపశువులను కాపాడుకోవచ్చు. వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రతకంటే బయటి ఉష్ణోగ్రత అధికమైనప్పుడు మెదడులోని హైపోథలామస్ స్వేద గ్రంథుల నిర్వాహణపై పర్యవేక్షణ కోల్పోతాయి. చెమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతుంది. దీంతో పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి శ్వాస ఆడక మరణించే ప్రమాదం ఉంది.

జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదం

కోవెలకుంట్ల పశు సంవర్ధకశాఖ డివిజన్ పరిధిలో 15,793 గేదెలు, 2,217 ఆవులు, 20,892 గొర్రెలు, 5,153 మేకలు ఉన్నాయి. ఎండతీవ్రత కారణంగా పశువులు, జీవాలు వడదెబ్బబారిన పడే అస్కారం ఉందని.. పశుపోషకులు వడదెబ్బపై అవగాహన కలిగి ఉండాలని..జాగ్రత్తలు తీసుకోవాలని వెటర్నరీ డాక్టర్ కృష్ణకుమార్ సూచించారు. రోజు రోజుకు ఎండలు అధికమవుతున్నందున పశువులు వడదెబ్బబారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

అధిక ఉష్ణోగ్రతే కారణం

వాతావరణంలో ఉష్ణోగ్రత ఎక్కువైనప్పుడు మెదడులోని హైపోథలామస్ అనే స్వేద గ్రంథుల మీద పర్యవేక్షణ కోల్పోతుంది. దీని వల్ల స్వేదగ్రంథులు చెమటను అధికంగా ఉత్పత్తి చేస్తాయి. చెమట ద్వారా శరీరంలోని ధాతువులు ఉప్పు ఎక్కువగా కోల్పోయి జీవక్రియ దెబ్బతింటుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి శ్వాస, గుండె, నాడి, మూత్రపిండాల విధులు తగ్గిపోయి పశువుల ఆరోగ్య పరిస్థితి విషమించి కోమాలోకి జారుకుని శ్వాస ఆడక మరణిస్తాయి.

వడదెబ్బకు ముఖ్య కారణాలు

- గాలిలో తేమశాతం అధికంగా ఉండడం
- వాతావరణ ఉష్ణోగ్రత పెరగడం
- పశువులు పాక సామర్థ్యానికి మించి ఉండడం
- నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు
- వడగాలులు, పశువులు ఒత్తిడికి లోనవడం.

లక్షణాలు

ఆవుల్లో శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల సెల్సియస్‌కు మించుతుంది. చర్మం మృదుత్వం తగ్గిపోయి గట్టి పడుతుంది. నోటితో గాలి పీల్చుకోవడం, నోటి వెంట చొంగ కారడం జరుగుతుంది. ఆవుల్లో పాల దిగుబడి, పునరుత్పత్తి, చూడుకట్టే శాతం తగ్గి గర్భస్రావం అయ్యే అవకాశం ఉండగా ఎద్దుల్లో వంధ్యత్వం వస్తుంది. తీవ్రత ఎక్కువ అయినప్పుడు పక్షవాత లక్షణాలు సంభవించి క్రమంగా కోమాలోకి వెళ్లి మృత్యువాత పడుతాయి.

చికిత్స విధానం

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే నీడ ప్రాంతానికి చేర్చి వీలైతే ఫ్యాన్లు లేదా కూలర్ల సాయంతో చల్లని గాలి అందించాలి. బాగా ఎండగా ఉన్న సమయాల్లో పశువులను చల్లని నీటితో పలుసార్లు కడగాలి. చల్లని నీరు తాగడానికి అందుబాటులో ఉంచి నొప్పులను తగ్గించడానికి నివారణ(అనాల్జేసిక్) మందులను వాడాలి. రక్తంలోకి డెక్స్‌ట్రోజ్ సెలైన్, లవణద్రావణాలు ఎక్కించాలి.



కుందూనదిలో సేద తీరుతున్న పశువులు

నివారణ

- వేసవిలో పశువులను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల మధ్య మేతకు వదలకూడదు.
- చల్లని తాగునీరు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలి.
- రోజుకు 3-4సార్లు చల్లని నీటితో కడగడం లేదా చెరువులు, గుంటలు ఉన్న చోట నీళ్లలోకి దించాలి.
- కొట్టాలను బాగా ఎత్తుగా నిర్మించుకుని పైన ఎండుగడ్డితో కప్పి ఎండగా ఉన్న సమయాల్లో దాని మీద నీళ్లు చల్లుతుండాలి.
- పశువుల పాకల్లో వడగాలి వస్తున్న దిక్కుల్లో గోనెసంచులు కట్టి నీళ్లు చల్లుతుండాలి. నీటిశాతం ఎక్కువగా ఉన్న మేపు(పచ్చిగడ్డి, పాతరగడ్డి, హైడ్రోఫోనిక్స్ గడ్డి) పెట్టాలి.
- మరీ ఎక్కువగా దాణా, ఉడికించిన ధాన్యాలు పెడుతున్నప్పుడు కొంచెం వంటసోడా కలపడం వల్ల ఎండ వేడిమికి గురైన పశువుల్లో వచ్చే అజీర్తి సమస్యలను నివారించవచ్చు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, తదితర రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

నేడు ఉపాధి హామీ గ్రామసభలు

ప్యాపిలి: మండల పరిధిలోని గుడిపాడు, పీఆర్ పల్లి, చంద్రపల్లి, చిన్నపొదిళ్ల, పెద్దపొదిళ్ల, జక్కసానికుంట్ల తదితర గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనులపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓలు వెంకటరమణ, నర్సిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని గ్రామ రచ్చకట్ట వద్ద గ్రామసభలు జరుగుతాయన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన ఏమైనా ఫిర్యాదులు, అభ్యంతరాలు ఉంటే ప్రజలు సోషల్ ఆడిట్ సిబ్బంది దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

చలి వేంద్రం ఏర్పాటు

డోన్ టౌన్: పట్టణంలోని ఇందిరానగర్‌లో జనసేన నాయకులు చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నాయకులు ఆలా మోహన్‌రెడ్డి, మౌలాలి, దస్తగిరి, వీరయ్య, దత్తు, మహేష్, పాపారాయుడు తెలిపారు. తొలి రోజు మంచినీళ్లతో పాటు మజ్జిగ ప్యాకెట్లను అందించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బేతంచెర్ల: మండల ప్రజలు పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సీఐ డి.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఎస్‌ఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

పురస్కార గ్రహీతకు సన్మానం

బనగానపల్లె రూరల్: ఇటీవల మధురిమ అనే నూతన సాహిత్య ప్రక్రియలో శతాధిక కవితలు రాసిన పూజారి శ్రీనివాసులును యూటీఎఫ్ నాయకులు ఆదివారం సన్మానించారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..శ్రీనివాసులు వంద కవితలు రాసినందుకు మేఘన సాహితీ కళా వేదిక సంస్థ మధుర కవి భూషణ పురస్కారం ఇవ్వడం అభినందనీయమన్నారు.



శ్రీనివాసులును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశాంతంగా ఉల్లాస్ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం

ప్యాపిలి: పొదుపు గ్రూపుల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్యాపిలి మండలంలోని 1400 మంది నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు చెప్పారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఆదివారం 60 కేంద్రాల్లో ఉల్లాస్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు 1147 మంది హాజరైనట్లు డోన్ ఏరియా కోఆర్డినేటర్ మల్లికార్జునస్వామి, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ ఫయాజ్ తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి నేషనల్ ఓపెన్ స్కూల్ ద్వారా తొమ్మిదో తరగతి ఉత్తీర్ణత సాధించినట్లు సర్టిఫికెట్ ఇస్తామన్నారు.

ఉల్లాస్ పరీక్షకు 1744 మంది హాజరు

బనగానపల్లె రూరల్: మండలంలో ఆదివారం నిర్వహించిన ఉల్లాస్ పరీక్షకు 1744 మంది మహిళలు హాజరైనట్లు డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం శ్రీనివాసులు తెలిపారు. మండలంలో మొత్తం 75 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 2100 మంది డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలు పరీక్షకు హాజరు కావాల్సివుండగా 1744 మంది హాజరైనట్లు వెల్లడించారు.



లింగాలలో పరీక్ష రాస్తున్న మహిళలు

మొక్కుబడిగా ఉల్లాస్ పరీక్ష

కోవెలకుంట్ల: నిరక్షరాస్యులైన 18 నుంచి 55 ఏళ్లలోపు మహిళలకు ఆదివారం నిర్వహించిన ఉల్లాస్ పరీక్ష మొక్కుబడిగా సాగింది. మండలంలోని 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ఆయా పరీక్ష కేంద్రాల్లో 750 మందికి రాత పరీక్ష నిర్వహించారు. అధికారులు తూతూ మంత్రంగా తరగతులు నిర్వహించి పరీక్షలను మమా అనిపించారు. మూడు పరీక్షల్లో ఒక్కో పరీక్షలో 16 మార్కుల చొప్పున 48 మార్కులు వచ్చిన అభ్యాసకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నారు.

సంక్షిప్తం

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, కలుగొట్ల గ్రామాలకు సంబంధించి ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వెల్లడించారు. గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, రేవనూరు, లింగాల, గుండుపాపల గ్రామాలకు సంబంధించి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. అల్లూరు, కొత్తపల్లె గ్రామాల పరిధిలో ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో..

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ మధుసూదన్ యాదవ్ తెలిపారు.

డోన్ ఉపాధ్యాయునికి పురస్కారం

డోన్: విజయవాడలో ఉషా పక్షపత్రిక నిర్వహించిన వెలగపూడి సీతారామయ్య స్మారక నవలా రచన పోటీల్లో డోన్ ఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం తొగట సురేష్‌బాబుకు ప్రోత్సాహక బహుమతి లభించింది. ఆదివారం విజయవాడలోని కేబీఎన్ కళాశాల ఆవరణలో ఉషా పక్షపత్రిక ఎండీ శరత్‌చంద్ర ప్రోత్సాహక బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

ఆకతాయిపై కేసు నమోదు

బనగానపల్లె: మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందవరం గ్రామానికి చెందిన కొప్పెర సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయం వెనుక వైపు ఉన్న మహిళల స్నానపు గదిలో ఓ భక్తురాలు స్నానాలు చేస్తుండగా ఆమె వీడియో చిత్రీకరించినట్లు ఎస్‌ఐ చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కొప్పెర సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉగాది పురస్కారాలకు ఎంపిక



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

డోన్ టౌన్: స్థానిక అగ్నిమాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న బి.ప్రభాకర్‌ను ఉత్తమ సేవకు నిగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఉగాది పురస్కారాల్లో భాగంగా ఆయన అవార్డు అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో అగ్నిమాపక సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపి సత్కరించారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ హనుమంత్ నాయక్

సంజామల: అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని కోవెలకుంట్ల సీఐ హనుమంత్ నాయక్ హెచ్చరించారు. మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో ఆదివారం ఉదయం సంజామల ఎస్‌ఐ రమణయ్యతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఉన్న అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం సీఐ మాట్లడుతూ..గ్రామంలో ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా ప్రశాంతమైన జీవితం గడపాలని సూచించారు. గొడవలు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. అల్లర్లకు పాల్పడి కేసులు నమోదైతే జీవితాలు నాశనం అవుతాయని సీఐ సూచించారు. ఈ మధ్య కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఓటీపీ అడిగితే ఇవ్వకూడదని పేర్కొన్నారు. సమస్యలు ఎదురైతే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

చోరీల అడ్డుకట్టకు అప్రమత్తత అవసరం



గ్రామస్తులకు సూచనలు చేస్తున్న సీఐ

కోవెలకుంట్ల: వేసవిలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అస్కారం ఉందని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ సూచించారు. మండలంలోని చిన్నకొప్పెర్లలో శనివారం సాయంత్రం ఓ ఇంట్లో చోరీ జరిగిన నేపథ్యంలో ఆదివారం సీఐ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లకు తాళం వేసి శుభకార్యాలకు వెళ్లే వ్యక్తులు ఇంటి పక్కలి వారికి లేదా పోలీసులకు సమాచారం ఇస్తే అలాంటి ఇళ్లపై నిఘా ఉంటుందన్నారు. రాత్రి వేళల్లో ఇళ్లకు తాళం వేసి మిద్దెలపై పడుకునే వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు కన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి శిబిరాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 850 మందికి గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, కంటి, చర్మం, కిడ్నీ తదితర సమస్యలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పెద్దిరెడ్డి షేక్షావల్ రెడ్డి, పెద్దిరెడ్డి మౌలాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిబిరానికి తరలివచ్చిన జనం

చెక్కుచెదరని రోడ్లు

ప్యాపిలి: ప్రస్తుతం అంతర్గత రహదారులుగా సీసీరోడ్లను వేస్తున్నారు. అయితే పూర్వం సీసీరోడ్లు వేయక ముందు వీధుల్లో బండ పరుపు వేసేవారు. నాపరాతి బండలను వీధి మొత్తం పరచి ఆ వీధికి వన్నె తెచ్చేవారు. మండల పరిధిలోని హుసేనాపురంతో పాటు పలు గ్రామాల్లో ఇప్పటికీ బండపరుపు వేసిన రోడ్లే కనిపిస్తాయి. ఎన్నో దశాబ్దాల క్రితం వేసిన ఈ రోడ్లు ఇప్పటికీ చెక్కుచెదరకపోవడం విశేషం. బండ పరుపు లేని వీధుల్లో మాత్రమే కొత్తగా సీసీ రోడ్లు వేస్తున్నారు. కొంత మంది ప్రస్తుతం ఈ రోడ్లపైనే మురుగు నీరు వదులుతుండడంతో అక్కడక్కడా రోడ్లు దెబ్బతింటున్నాయి.



హుసేనాపురంలో చెక్కుచెదరని బండపరుపు రోడ్డు

దుండగులను కఠినంగా శిక్షించాలి

ప్యాపిలి/అవుకు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ, జై భీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దేవరత్నం, కన్వీనర్ సుధాకర్ ఆదివారం డిమాండ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా దూబచర్ల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.



ప్యాపిలిలో రాలిన మునగకాడలను చూపిస్తున్న బాధిత రైతు



సొదరదిన్నెలో తడిచిపోయిన పొగాకు



ప్యాపిలిలో రాలిన మామిడి కాయలు

పంట వర్షార్పణం

కోవెలకుంట్ల: ఉపరితల ద్రోణి ప్రభావంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్‌లో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వడగండ్ల వర్షం రైతులను నట్టేట ముంచింది. కోవెలకుంట్ల మండలంలో అత్యధికంగా 18.2 మి.మీ, ఉయ్యాలవాడలో 9.2 మి.మీ, అవుకులో 3.2 మి.మీ, సంజామలలో 2 మి.మీ, కొలిమిగుండ్లలో 0.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. భారీ వర్షానికి మిరప, మొక్కజొన్న, పొగాకు, పత్తి దిగుబడులు తడిచిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అలాగే వరి నేలవాలి రైతులకు నష్టం కలిగించింది. దెబ్బతిన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



గుళ్లదూర్తిలో నేలవాలిన వరి



రేవనూరులో రాలిపోయిన మిరపకాయలు

దెబ్బతిన్న మామిడి, మునగ తోటలు

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం వీచిన ఈదురు గాలులు, వడగండ్ల వానకు మామిడి, మునగ తోటలు దెబ్బతిన్నాయి. ప్యాపిలికి చెందిన కడితం బాలిరెడ్డికి చెందిన రెండెకరాల మునగ తోట పూర్తిగా దెబ్బతింది. మరి కొద్ది రోజుల్లో కోత కోసి మార్కెట్‌కు తరలించాల్సి ఉండగా ఇలా జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్యాపిలి, పెద్దపొదిళ్ల, కలచట్ల, పోతుదొడ్డి, వెంగళాంపల్లి, ఏనుగుమర్రి తదితర గ్రామాల్లో దాదాపు వంద ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

భగత్‌సింగ్‌కు నివాళి



బేతంచెర్ల: నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

డోన్ టౌన్/డోన్ రూరల్/బేతంచెర్ల: స్వాతంత్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం డోన్, బేతంచెర్లలో వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. డోన్ పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, సుబ్బరాయుడు, బాబుతో పాటు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, సీపీఐ నాయకులు నివాళులర్పించారు. బేతంచెర్లలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, భార్గవ్, ఎల్లకృష్ణ పాల్గొన్నారు.



డోన్‌లో నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు